మరోసారి భృతి మోసం

ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే వరకూ నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. తీరా గద్దెనెక్కి తొమ్మిది నెలలు గడుస్తున్నా.. ఆ హామీ అమలుపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. నిరుద్యోగులకు భృతి అందించే ప్రతిపాదనే ప్రభుత్వం వద్ద లేదని ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సాక్షిగా ప్రభుత్వం రాత పూర్వకంగా తేల్చి చెప్పేసింది. నగరి నియోజకవర్గంలో దాదాపుగా 25 వేల మంది నిరుద్యోగులు ఉన్నట్లు అధికారుల అంచనా. 2014లో చంద్రబాబు హామీలను నమ్మి మోసపోయినట్లు 2025లోనూ నిరుద్యోగులు మరోసారి మోసపోయారు.

- నిరుద్యోగులకు పంగనామం
- 2014, 2024లో ఒకే తరహా మోసం
- ఎన్నికలకు ముందు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి హామీ
- ఆ తర్వాత ఊసెత్తని కూటమి ప్రభుత్వం

విజయపురం: యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతిపై నోరు విప్పడం లేదు. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై గంపెడాశలు పెట్టుకున్న యువతకు చంద్రబాబు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. ప్రమాణ స్వీకారం రోజున మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి, ఇప్పటి వరకు డీఎస్సీ నిర్వహించకుండా కాలయాపన చేస్తోంది. నియోజకవర్గంలో దాదాపుగా 8 వేల మందికి పైగా బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. తొలి సంతకాన్ని నమ్మి అభ్యర్థులు తిరుపతి, నెల్లూరు, అవనిగడ్డ, విజయవాడ తదితర జిల్లాల్లో నెలల తరబడి కోచింగ్ తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం టెట్‌తో సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. కనీసం ఎన్నికల హామీ మేరకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.


గత ప్రభుత్వ హయాంలో జాబ్‌మేళాకు హాజరైన యువత(ఫైల్)

ఇంటికో ఉద్యోగం భ్రమేనా?


2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 600కు పైగా హామీలిచ్చి గద్దెనెక్కారు. 2024లోనూ అదే తరహాలో హామీలిచ్చి నిరుద్యోగులను మోసం చేయడం అలవాటైపోయింది. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు నెలనెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలి.

–శివరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, విజయపురం

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి


నేను బీటెక్ పూర్తి చేశాను. ప్రస్తుతం ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఇంటికో ఉద్యోగం లేదా నెలనెలా నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకూ నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. కనీసం ఇస్తారో లేదో చెప్పడం లేదు. చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలు అని అర్థం అవుతోంది.

–వెంకట్, వేపగుంట

మోసం చేయడం చంద్రబాబు నైజం


నేను డిగ్రీ పూర్తి చేశాను. ఉద్యోగం రాకపోవడంతో ఇంటి దగ్గరే ఉంటున్నాను. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటుతున్నా నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేస్తోంది. కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో చదువుతున్న ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. యువకులు నమ్మి చంద్రబాబుకు ఓటు వేశారు. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధాకరం.

–శ్రీనిషా, పుత్తూరు

ఉద్యోగాలు భర్తీ చేయాలి


ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు భృతి ఇవ్వాలి. యువకులు చదువుకుని ఉద్యోగాలు లేక వ్యవసాయ, ఉపాధి పనులకు వెళ్తున్నారు. ప్రభుత్వం అప్పుల్లో ఉంది.. హామీలు అమలు చేయలేమని చెప్పడం సిగ్గుచేటు.

–లోకేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, వడమాలపేట

క్లుప్తంగా

చెరుకు ట్రాక్టర్లతో ట్రాఫిక్ జామ్


పళ్లిపట్టు రోడ్డులో చెరకు లోడ్డు ట్రాక్టర్ కారణంగా ట్రాఫిక్ జామ్

నగరి: పరిమితికి మించి చెరుకు లోడ్డుతో వెళ్లే ట్రాక్టర్ల కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. సాధారణంగా ఎక్కించాల్సిన లోడ్డుకన్నా ప్రత్యేకంగా సిద్ధం చేసిన ట్రాలీలలో అధిక లోడ్డుతో ట్రాక్టర్లు వెళుతున్నాయి. నెలవాయి ఎస్‌ఎన్‌జే షుగర్ ఫ్యాక్టరీలకు వెళ్లే క్రమంలో ఈ ట్రాక్టర్లు పట్టణ పరిధిలోని నాగలాపురం రోడ్డు, పళ్లిపట్టు రోడ్డు మీదుగా వెళుతున్నాయి. దీంతో ఈ మార్గంలో ఎదురుగా బస్సులు వస్తే ట్రాఫిక్ జామ్ అవుతోంది. పలు వాహనాలు రోడ్డుపై ఆగిపోతున్నాయి. వీటిని నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

శాశ్వత జీవామృతం తొట్టెల నిర్మాణం


శాశ్వత జీవామృతం తొట్టె ఏర్పాటు

నగరి: రైతులు తమ పొలాల్లో శాశ్వత జీవామృతం తొట్టెలను ఏర్పాటు చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ఆదివారం మండలంలోని మేళపట్టు గ్రామానికి చెందిన రాణెమ్మ అనే రైతు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహకారంతో శాశ్వత జీవామృతం తొట్టెను ఏర్పాటు చేసుకుంది. పొలంలోని నీటి కాలువ పక్కనే ఏర్పాటు చేసుకునే ఈ శాశ్వత జీవామృతం తొట్టె నుంచి జీవామృతం నీటిలో కలుస్తూ పంటలకు పారడం వలన పంటలు ఏపుగా పెరుగుతాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు.

ప్రజలకు సేవచేయడమే ధ్యేయం


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పైమాఘం సుగుణాకర్ రెడ్డి

తవణంపల్లె: ప్రజలకు సేవ చేయడమే ధ్యేయమని అర్ధగిరి ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ పైమాఘం సుగుణాకర్ రెడ్డి తెలిపారు. అరగొండ పంచాయతీ బీసీ కాలనీలో ఆదివారం తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వాటర్ ప్లాంట్‌లో స్విచ్ ఆన్ చేసి స్థానికులకు పరిశుద్ధ నీటిని అందిచారు. ఆయన మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లుదొరై, మాజీ సర్పంచ్ కరీం, ప్రశాంతకుమార్, చలపతి ల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక సెల్

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో నీటి సమస్యలుంటే 98499 07885 నంబర్‌కు కాల్ లేదా వాట్సాప్ చేయాలని కమిషనర్ పి.నరసింహప్రసాద్ ఆదివారం తెలిపారు. వేసవిలో నీటి సమస్య పరిష్కారానికి నగరపాలక కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే ఆ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. నీటి సమస్య రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4న రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మంగళ, బుధవారాల్లో ఇంటర్వ్యూలు ఉంటాయని కమిషనర్ పి.నరసింహప్రసాద్ తెలిపారు. మంగళవారం 1–25 డివిజన్ వాసులకు, బుధవారం 26–51 డివిజన్ పరిధిలోని దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. నగరపాలక కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుదారులు సంబంధిత ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం


శ్రీకాళికాదేవి అమ్మవారు

గంగాధరనెల్లూరు: మండలంలోని మిట్టవేల్కూరు గ్రామంలో శ్రీకాళికాదేవి కుంభాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం గోపూజ, ప్రాణ ప్రతిష్ట హోమం, నేత్ర దర్శనం, నాడీ సంధానం, బీజాక్షర హోమం, దుర్గా హోమం, మహాపూర్ణాహుతి పూజ కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం గ్రామస్తులు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

కలగా కల్వర్టుల నిర్మాణం


రెడ్డేపల్లె వద్ద కల్వర్టు లేని రోడ్డు


ఎనమలమంద సమీపంలో దుస్థితిలో ఉన్న రోడ్డు

- ప్రధాన రహదారులపై కల్వర్టులు లేక అవస్థలు

వెదురుకుప్పం: మండలంలోని ప్రధాన రహదారులపై కల్వర్టులు లేక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడక తప్పడం లేదు. రోడ్లపై వాగులు, వంకలు ప్రవహిస్తుండడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేకపోతోంది. ప్రధానంగా ఆళ్లమడుగు గ్రామం నుంచి ఎనమలమంద గ్రామం వరకు ఉన్న ప్రధాన రహదారిపై పలు చోట్ల రోడ్డు అధ్వానంగా ఉంది. ప్రధాన రహదారి పక్కన అడవి ఉంది. అడవి నుంచి వచ్చే వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డు కోతకు గురై దుస్థితికి చేరింది. ఇలా ఐదు చోట్ల రహదారిపై వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో రోడ్డు కోతకు గురవుతోంది. అక్కడక్కడా రోడ్డు వాగును తలపించడంతో వాహన చోదకులు వాహనాలు నడిపేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టులు నిర్మించాలని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

ఆదమరిస్తే అంతే సంగతులు

మండలంలో తంగేళిమిట్ట నుంచి దేవరగుడిపల్లె వరకు తిరుపతి–చిత్తూరు ప్రధాన రహదారిపై అనేక చోట్ల వంకలు సాగుతోంది. తంగేళిమిట్ట సమీపంలోని బుగ్గ వంక రోడ్డుపై ప్రవహిస్తోంది. వర్షాలు వస్తే రోడ్డుపై వర్షపు నీటి ప్రవాహం వెల్లువలా ఉంటోంది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మూడు అడుగుల మేరకు నీరు ప్రవహించడంతో వాహనాలు కొట్టుకుపోతున్నాయి. దీంతో రోడ్డు దాటేందుకు తంటాలు పడుతున్నారు. రెడ్డేపల్లె వద్ద రోడ్డు నాలుగు అడుగుల లోతులో ఉంది. తిరుమలయ్యపల్లె, పెద్దబైలు, దేవరగుడిపల్లె సమీపంలో ఇలాంటి పరిస్థితులు ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం రోడ్డు కూడా దుస్థితికి చేరి కుంగిపోయింది. దీంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నట్లు చెబుతున్నారు. ప్రమాదం పొంచిఉన్నా అధికారులు స్పందించడం లేదు. రోడ్డుపై కల్వర్టు నిర్మాణం చేపట్టాలని పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 22 మంది


రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బంగారుపాళెం: స్థానిక ఎస్‌పీసీ నాయుడు పార్కు ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, దివంగత ఎంపీ చెంగల్‌రాయ నాయుడి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రారంభించారు. తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి డాక్టర్లు శిబిరానికి వచ్చిన 105 మందికి పరీక్షలు చేశారు. అందులో 22 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని తిరుపతికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, మాజీ సర్పంచ కమలనాథ రెడ్డి, బీజేపీ నాయకులు జగదీశ్వర్, భానుప్రకాష్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

550 మందికి ఉచిత వైద్యం



రోగులకు వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ కిరణ్, రోగులకు కంటి వైద్య పరీక్షలు

విజయపురం: మండలంలోని పాతర్కాడు గ్రామంలో ఆదివారం అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ రవిరాజు అధ్యక్షతన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుత్తణి పట్టణానికి చెందిన పికాక్ హాస్పిటల్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కిరణ్ తోపాటు మరో ముగ్గురు వైద్యులు 550 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గుండె, కన్ను, ఎముకలు, నరాల సంబంధిత వ్యాధులతోపాటు సర్జరీ జబ్బులతో బాధపడుతున్న వారు అధిక సంఖ్యలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


పరుగులు తీస్తున్న పశువులను నిలువరించేందుకు యత్నిస్తున్న యువకులు

ప్రశాంతంగా మైలేరు పండుగ

బైరెడ్డిపల్లి: మండలంలోని జాలారిపల్లెలో ఆదివారం మైలేరు పండుగ సందడితో హోరెత్తింది. ఉదయం 6 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాక పొరుగు రాష్ట్రాల నుంచి మైలేరు పండుగ పరుగుపందెంలో వదిలిపెట్టడానికి పశువులను తీసుకువచ్చారు. ఇరువైపులా కొయ్యలతో ఏర్పాటు చేసిన అల్లెలో పశువులను వదిలిపెట్టారు. పశువులను నిలువరించడానికి యువకులు పోటీ పడ్డారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామస్తులు ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. పరుగుపందెంలో గెలుపొందిన పశువులకు సంబంధించి వాటి యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

బ్రహ్మరథంపై శివపార్వతులు

బంగారుపాళెం: మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం సాయంత్రం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ బ్రహ్మరథంపై భక్తులకు కనువిందు చేశారు. ఉదయం స్వామి, అమ్మవారి మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను బ్రహ్మరథంపై కొలువుదీర్చారు. శ్రీకామాక్షమ్మ, మొగిలీశ్వర స్వామి బ్రహ్మరథంపై భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా పుష్పపల్లకి


శ్రీగిరిజా సమేత కాలభైరవేశ్వరస్వామి

బైరెడ్డిపల్లి: కోట్రీపల్లె సమీపంలోని శ్రీ కాలభైరవేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వైభవంగా పుష్పపల్లకి నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన పల్లకిపై శ్రీగిరిజా సమేత శ్రీ కాళభైరవేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

మహిళలకు జీవనజ్యోతి పురస్కారాలు


పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): కర్తవ్యాన్ని విడవకుండా, స్వార్థానికి లోబడకుండా వుండే స్త్రీత్యాగం సృష్టి ఉద్దీపనమని ప్రముఖ సాహితీవేత్తలు జి.శాంతకుమారి, కె.సి.లావణ్య పేర్కొన్నారు. నగరంలోని రెడ్డిభవన్‌లో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ గౌరవాధ్యక్షులు మత్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో 'స్త్రీవాద కవిత్వం'పై జాతీయ కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో మహిళలకు జీవనజ్యోతి పురస్కారాలు అందజేశారు. వారు మాట్లాడుతూ కీచకుల కాలరాచు వీరనారీమణులుగా మహిళలు శక్తియుక్తులను ప్రదర్శించాలన్నారు. నయాకేర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఎడ్లపల్లి మాధుర్య మాట్లాడుతూ స్త్రీ ధిక్కార స్వరాలే స్త్రీవాద కవిత్వం అన్నారు. రచయిత సమాఖ్య జాతీయ అధ్యక్షులు సి.నారాయణ స్వామి, ప్రముఖ కవి కొఠారి వెంకటరత్నం సంయుక్తంగా మాట్లాడుతూ స్త్రీవాద భావ ప్రకటనతోనే సమాజంలో తమ అస్తిత్వ నిరూపణకు పోరాడుతున్న మహిళలు అభినందనీయులని అన్నారు. 12 మంది మహిళలకు 'జీవనజ్యోతి' జాతీయ పురస్కారాలను, 24 మంది సాహితీవేత్తలను మరియు సంఘసేవకులను ప్రముఖ సాహితీవేత్త దేవేంద్రరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి మాధుర్య, ఎస్.చంద్రకళ, కె.ప్రేమావతి, ఇ.గంగాభవాని, కె.నాగమణి, పి.స్వప్న, టి.హార్తి, కె.తులసి, పి.జగదాంబ, టి.మంజులదేవి, సన్మాన గ్రహీతలు సి.నారాయణస్వామి, నందిపాటి చక్రపాణి, డా.కొఠారి వెంకటరత్నం, తోట గోవిందన్, ఎం.శ్రీరాజు, ఎస్.మునీంద్ర, కోటీశ్వర మొదలియార్, హరిప్రసాద్ రెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, టి.రామచంద్ర, వి.పవన్, అనంత పద్మనాభన్, రంగనాథన్, ఎన్.షణ్ముగం, ఆనందనాయుడు, డి.రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

పూత.. జాగ్రత్త



బూడిద తెగులుతో ఎండిపోయిన మామిడి పూత, పూత కోసం మందుల పిచికారీ

పాలసముద్రం: మామిడిలో మంచి దిగుబడి రావాలంటే పూత, పిందె ప్రధానం. పూత రాలే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధిఇంచ వచ్చునని చిత్తూరు డివిజినల్ ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి.ఈ సంవత్సరం పంటకు అనుకూలమైన పరిస్థితి ఉందనుకుంటే వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో తెగుళ్ల సోకే ప్రమాదం ఉంది. మరి కొన్ని ప్రాంతాల్లో ఇంతవరకు మామిడి తోటలో పూత రావడం లేదు. ఈ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మామిడి పంట నష్టపోకుండా అనుకున్న దిగుబడి సాధించవచ్చు.

వాతావరణ మార్పులతో ఇబ్బంది

వాతావరణ మార్పులతో మామిడి రైతులు గత మూడు సంవత్సరాలుగా తీవ్రంగా నష్టపోతున్నారు. పూత సమయానికే వర్షాలు రావడంతో పూత రాలిపోతోంది. దీనికి తోడు చలి కూడా పెరగడంతో మొగ్గలు సరిగా విచ్చుకోవడం లేదు. పూత ఆలస్యంగా రావడం, పిందె కట్టకపోవడంతో మామిడి సకాలంలో కోతకు రావడం లేదు. వాతావరణ ప్రభావాన్ని అధిగమించాలంటే రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించాలి.

బూడిద తెగులు

ఈ తెగులు ఆకులు, పూతపై ఆశించినప్పుడు బూడిదలాంటి తెల్లని ప్రదార్థం వ్యాపించి పూత, పిందె రాలిపోతుంది. చల్లని రాత్రులు 15 సెంటీగ్రేడ్, వేడి పగటి వాతావరణం(33 నుంచి 37 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు)అంటే జనవరి 25 నుంచి ఫిబ్రవరి వరకు ఈ తెగులు పూత మీద ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ శిలీంధ్రం ఆశిస్తే పూత, పిందె మాడిపోయి రాలిపోతుంది.

నివారణ చర్యలు: ముదు జాగ్రత్తగా జనవరిలో నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి చెట్టు మొత్తం తడిచేలా ఉదయం లేదా సాయంత్రం పిచికారీ చేయాలి. మామిడి పూత మొత్తం విచ్చుకున్న తర్వాత (జనవరి 25వ తేదీ తర్వాత) నీటి తడులు ఇచ్చిన వారం రోజుల తర్వాత హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్లు ఒక్క లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పూత కోసం జాగ్రత్తలు

మామిడి తోటలో పూత రావాలంటే ప్రస్తుతం లీటరు నీటిని 5 గ్రాములు పొటాషియం నైట్రేటు, 5గ్రాముల యూరియా కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని 10–15 రోజుల వ్యవధిలో 2 నుంచి 3సార్లు పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేటు అందుబాటులో లేకపోతే మల్టీకే వాడవచ్చు. జనవరి నెలలో మచ్చ, బూడిద తెగులు, తేనె మంచు పురుగులు వ్యాపించడానికి అవకాశం ఉంది. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 2 ఎంఎల్, దీనితో పాటు కార్బండిజమ్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు మొదలు కొమ్మలు, రెమ్మలు పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలి. జింక్ లోపమున్న తోటలో జింక్ సల్ఫేట్‌ను 2 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పూత రాలకుండా..

మామిడి తోటల్లో పూత రాలకుండా ఉండాలంటే రోగస్ డైమిథేన్ 2 మిల్లీ 1లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు బెడద తగ్గి పూత నిలబడుతుంది. తోటల్లోని ఒక్కో మామిడి చెట్టుకు పశువుల ఎరువు, 3 కిలోల వేప పిండి, 750 గ్రాముల యూరియా, 1,250 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్, 500 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసుకోవాలి. మొక్కల్లో సూక్ష్మ ధాతువు లోపం నివారించేందుకు గాను 5 గ్రాముల జింక్ సల్ఫేట్, యూరియా 20 గ్రాములు 1లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

స్కాలర్‌షిప్ పంపిణీ


స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ కళ్యాణ మండపంలో ఆదివారం అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. బలిజల్లో 20 మంది పిల్లలకు స్కాలర్ షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు కిషోర్, గిరి, శ్రీధర్, వంశీ, ప్రభాకర్, కిరణ్, చందు, కుమార్ యశ్వంత్ పాల్గొన్నారు.